క్లుప్తంగా

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

తాడికొండ: తుళ్లూరు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.శిల్పా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న వెలగపూడి, దొండపాడు పంచాయతీ కార్యాలయం వద్ద, 26న నేలపాడు, 27, 28 న పెదపరిమి,తుళ్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని ప్రజలు దీనిని వినియోగించుకోవాలని తెలిపారు.

తాడేపల్లిలో వరస చోరీలు



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో చోరీలు జరుగుతుండడంతో చిరు వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం తెల్లవారుజామున ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి తాడేపల్లి సాయిబాబా గుడి వద్ద డేవిడ్ రాజు అనే చిరు వ్యాపారి దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. దుకాణం పగలకొట్టి అందులో ఉన్న కూల్‌డ్రింక్ బాటిల్స్, సిగరెట్లు, రూ.6 వేల నగదు దొంగిలించారు. ఆ చిరు వ్యాపారి సుమారు రూ.18,500 నష్టం జరిగిందని, దుకాణం మరమ్మతులకు మరో రూ.5 వేలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న మూడు ద్విచక్ర వాహనాల హ్యాండిల్ లాక్ తొలగించి చోరీ చేశారు. ఈ నెల 18న పాత పోస్టాఫీస్ వద్దపోయిన ద్విచక్ర వాహనాన్ని విజయవాడ మాచవరం వద్ద గుర్తుతెలియని వయక్తులు వదిలి వెళ్లిపోయారు.

సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద రెండు నగదు చెక్కులను బాధితులకు సోమవారం పంపిణీ చేశారు. మన్నవ జ్యోతికి రూ 1,70,727లు, షేక్ మస్తాన్‌కి రూ.43,727లు మంజూరుకాగా టీడీపీ నాయకులు నాయకులు తోట పార్థసారథి, జువ్వాది కిరణ్ చంద్, ఏళ్ల శివరామకృష్ణయ్య, మాదల రమేష్‌బాబు వాటిని అందజేశారు.

మొక్కజొన్న కొనుగోలు చేయాలి



దుగ్గిరాల: చిన్న, సన్నకారు రైతులు పండిస్తున్న పెసలు, మొక్కజొన్న పంటలను రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు కోరారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ఐ.సునీతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పెసలు ధర క్వింటాకు రూ.8వేలు ఉండగా ప్రవేటు వ్యక్తులు దగ్గర వాటి ధర రూ.7వేలుగా కొనుగోలు చేయడంతో రైతులు వెయ్యి రూపాయలు నష్టం పోతున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ కొనుగోలు చేస్తామని పంట కొనుగోలు చేస్తామని ప్రకటన చేసినప్పటికీ ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బి.అమ్మిరెడ్డి, స్టాలిన్ ఉన్నారు.


తాడేపల్లి వ్యక్తికి ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు



తాడేపల్లి రూరల్ : తాడేపల్లికి చెందిన ఐ. నాగేశ్వరరావుకు ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు అందుకున్నారు. విశాఖపట్నంకు చెందిన ఉత్తరాంధ్ర కోస్తా కార్టూనిస్టుల ఫారం హాస్యానందం సౌజన్యంతో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది (2025) సంవత్సరానికి గాను ఐ.నాగేశ్వరరావు వేసి కార్టూన్‌ను ఎంపిక చేశారు. ఆ అవార్డును నాగేశ్వరరావు విజయవాడ కేబీఎన్ కళాశాలలో విశాఖపట్నంకు చెందిన నార్త్ కోస్టర్ ఫారం, హాస్యానందం సంపాదకులు రాము, రామశర్మ, టి.ఆర్. బాబు, ఎస్. లక్ష్మణరావుల సమక్షంలో అందుకున్నారు. ఐ.నాగేశ్వరరావుకు ఉత్తమ కార్టూన్ అవార్డు రావడంతో తాడేపల్లి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేసవి వ్యాధులు..

తీసుకోవాలి జాగ్రత్తలు





- పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు
- అతిసారం, చర్మ వ్యాధులపై తప్పని అప్రమత్తత
- గ్లూకోజ్ స్థాయి పడిపోకుండా జాగ్రత్తలు



ఖాళీగా ఉన్న జాతీయ రహదారి

తాడేపల్లి రూరల్: ఎండలో ఇష్టానుసారంగా తిరిగినా, నీరు తక్కువగా తీసుకున్నా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నా, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చెమటలు పట్టకపోవడం, కాళ్లు చేతుల నొప్పులు, శరీరం తిమ్మిరి, వాంతులు, తలనొప్పి, స్పృహ కోల్పోవడం వంటివి వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీరాన్ని చల్లబర్చాలి. తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. నీళ్లు తాగించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లడం ఉత్తమం. ఈ సమస్య రాకుండా ఉండాలంటే నీరు అధికంగా తీసుకోవాలి. నిమ్మరసం, కొబ్బరి నీరు, గ్లూకోజ్ వంటివి తీసుకోవాలి. ఇంట్లో ఎలక్ట్రోరల్ పౌడర్ లేదా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలి. ఇవి అందుబాటులో లేకపోతే చక్కెర, ఉప్పు కలిపిన నీటిని తాగాలి.

కంటి ఇన్ఫెక్షన్లు

వేసవిలో కనిపించే కొన్ని సాధారణ కంటి వ్యాధుల్లో కంటి వాపు ఒకటి. తగినంత విశ్రాంతిని కళ్లకు ఇవ్వాలి. క్రమం తప్పకుండా శుభ్రమైన నీటితో కళ్లను కడగాలి. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా కళ్లజోడు వాడాలి. సమస్యలు వస్తే డాక్టర్‌ను సంప్రదించాలి.

అతిసారం

ఎండ వేడి కారణంగా ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటి ఆహారం తీసుకుంటే వేసవిలో విరోచనాలు సాధారణం. కలుషిత ఆహారం తినడం, కలుషిత నీరు తాగడం, మద్యపాన అలవాట్లు డయేరియాకు దారి తీస్తాయి. అతిసారం నుంచి దూరంగా ఉండడానికి నీటిని మరిగించిన తరువాత మాత్రమే తాగాలి. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి.

చర్మవ్యాధులు

సూర్యుడి అతినీల లోహిత కిరణాల వల్ల చర్మంలోని కణాలు దెబ్బతింటాయి. ఎండలో ఎక్కువగా తిరిగితే చర్మం కమిలిపోతుంది. అధిక తేమ, వేడి కారణంగా చర్మంపై ఎరుపు దద్దుర్లు, స్వేద గ్రంథులు మూసుకుపోవడం వంటి సమస్యలు వస్తాయి. చెమట వల్ల మచ్చలు, దురద, మంట వస్తుంది. చర్మ సమస్యలు రాకుండా ఉండాలంటే వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్లు వంటివి ఉపయోగించాలి. వాడిన దుస్తులను ఉతక్కుంగా మళ్లీ వేసుకోకూడదు. శరీరానికి గాలి తగిలేలా వదులైన, చెమటను పీల్చే కాటన్ దుస్తులు ధరించడం మేలు.

గవద బిళ్లలు

వేసవిలో వచ్చే వ్యాధుల్లో గవద బిళ్లలు ఒకటి. ఈ వైరల్ వ్యాధి పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఈ అంటు వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వ్యాపిస్తుంది. లాలాజల గ్రంధివాపు, కండరాల నొప్పి, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవడం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

తలనొప్పి

అధిక ఉష్ణోగ్రతలతో తలనొప్పి ఎక్కువగా కనిపిస్తుంది. వేడి వల్ల వచ్చే తలనొప్పి శరీరం వేడికి ప్రతిస్పందించడం వల్ల కూడా వస్తుంది. డాక్టర్ సలహా మేరకు మందులు వాడితే నియంత్రణలో ఉంటుంది.

నీరు ఎక్కువగా తీసుకోవాలి



ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి తరచు మంచినీరు, నిమ్మకాయ ద్రావణంతో పాటు ఎక్కువగా మజ్జిగ తీసుకోవాలి. నారింజ, దానిమ్మ వంటి పండ్లను తినాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కళ్ల సంరక్షణ కోసం కూలింగ్ గ్లాసులు పెట్టుకోవాలి. లేత రంగు, తేలికైన, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ప్యాకింగ్ చేసిన పండ్లు, కూరగాయలు తీసుకోవద్దు. కూల్‌డ్రింక్‌లు తాగకూడదు.

– డాక్టర్ మానస, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, అంబేద్కర్ నగర్

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

వైఎస్సార్‌సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

దుగ్గిరాల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అధినాయకత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని పార్టీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. దుగ్గిరాలలో పార్టీ క్రియశీల కార్యకర్తల సమావేశాన్ని ఆయన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్టీ నాయకులపై అనేక అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. వాటిని పార్టీ అధిష్టానం ధీటుగా ఎదుర్కోవటంతో పాటు ఇబ్బందులు పడే నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తోందనే భరోసాను కల్పించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య, జానీబాషా, షేక్ సుభానీ, స్థానిక నాయకులు, కారకర్తలు పాల్గొన్నారు.

డీబీఎస్, మాజేటీలకు సత్కారం



దేవతి భగవన్నారాయణను సత్కరిస్తున్న రచ్చబండ ఫ్రెండ్ సర్కిల్ ప్రతినిధులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని పెదకోనేరు వద్ద ఊటీలో ట్రైబల్ కల్చర్ సెంటర్‌లో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన స్థానిక డీబీఎస్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ దేవతి భగవన్నారాయణ, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయడంలో 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న మాజేటి వేణుగోపాల కృష్ణ శ్రేష్టిలకు సోమవారం రచ్చబండ ఫ్రెండ్ సర్కిల్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్ సర్కిల్ అధ్యక్షులు చిదేళ్ల వాసు మాట్లాడుతూ ఆధ్యాత్మిక ధార్మిక సేవా కార్యక్రమాలు చేసిన భగవన్నారాయణకు గౌరవ డాక్టరేట్ ఇవ్వడం, 25 సంవత్సరాలుగా నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భక్తులకు సూర్య వేణుగోపాల కృష్ణ ప్రసాదాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మద్దుల శివశంకర్ ప్రసాద్, నేరెళ్ల లక్ష్మణ, కొలిశెట్టి రాము, రామకృష్ణ, రమణ, రంజిత్ కుమార్, దివ్వెల రవి, శ్రీ లక్ష్మీ నరసింహ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మేకల మోహనరావు, ఫ్రెండ్ సర్కిల్ ప్రతినిధులు చిదేళ్ళ వాసు, మాజేటి సత్య బాలాజీ, భోజనపల్లి తాండవ, మురళి, నాగుబండి కుమార్ పాల్గొన్నారు.

మురుగు నీటి నివారణకు చర్యలు తీసుకోవాలి



మధుకు తమ సమస్యలు విన్నవించుకుంటున్న స్థానికులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్, మణిపాల్ ఆసుపత్రి ప్రాంతాల్లో మురుగునీటి నివారణకు చర్యలు తీసుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు పి. మధు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రి ,సుందర్య నగర్ కరకట్ట ప్రాంతల్లో నాయకులతో కలసి ప్రజల వద్ద నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ మురుగునీటి కోసం ప్రత్యేకంగా గుంతలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వచ్చే అద్దెలతో మురుగునీరు ఎత్తిపోసుకోవడానికి సరిపోవడం లేదని వివరించారు. మురుగునీరు పారే దారి లేక ఇళ్ల మధ్యన పెద్ద ఎత్తున పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు వృద్ధి చెంది అనారోగ్యాల పాలు అవుతున్నామని మధుకు తమ సమస్యను తెలియజేశారు. మున్సిపాలిటీ వారు అన్ని రకాల చార్జీలు వసూలు చేస్తున్నా తమకు సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి. మధు మాట్లాడుతూ అమరావతికి గేట్‌వేగా ఉన్న తాడేపల్లిలో ఉన్న ఇబ్బందులను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్‌ను కలసి మెమోరాండం ఇవ్వాలని, మంత్రి నారా లోకేష్‌ను కలవాలని, అందుకు బాధితులందరూ సిద్ధం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ మురుగు నివారణ కమిటీ నాయకులు జొన్నవిత్తుల శేషయ్య, సిపిఎం నాయకులు వై. నేతాజీ, బూరగ వెంకటేశ్వర్లు, పల్లె కృష్ణ, కొట్టే కరుణాకర్‌రావు, వేముల దుర్గారావు, ప్రభాకర్, గిరిజ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌గా తెనాలి మున్సిపాలిటీ



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణాన్ని మహానగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ, మూడు కాంపాక్టర్లను సోమవారం శివాజీచౌక్‌లో ఆయన ప్రారంభించారు. ముందుగా శివాజీచౌక్‌లోని యడ్లపాటి వెంకట్రావు ద్వారాన్ని పునఃనిర్మించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ చాలెంజింగ్ కాంపిటీషన్‌లో గెలుపొందిన పారిశుద్ధ్య ఉద్యోగులకు మెమెంటో, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించడం తెనాలిలో మొట్టమొదట ప్రారంభమైందని గుర్తు చేశారు. సుందరీకరణలో భాగంగా శివాజీచౌక్‌లో రూ.1.30 కోట్లతో రోడ్డును విస్తరిస్తున్నట్లు, రూ.2.60 కోట్లతో కొత్త పారిశుద్ధ్య వాహనాలను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. స్వచ్ఛాంధ్ర పోటీలను నిర్వహించిన అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్, యడ్లపాటి వెంకట్రావు మనవడు యడ్లపాటి తేజను ఆయన అభినందించారు. తెనాలి త్వరలో కార్పొరేషన్‌గా మారనున్నదని ఫస్ట్ కమిషనర్‌గా పవర్ స్వప్నిక్ జగన్నాథ్‌ను తీసుకురానున్నట్లు ప్రకటించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్లు సయ్యద్ ఖలేదా నసీమ్, కొత్రపాటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మనోహర పండుగ



ఫిరంగిపురం: మండలంలోని గరుడాచలపాలెం గ్రామంలో ఆరాధన మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మనోహర పండుగ ఆదివారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా యాద మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ కె.నెహెమ్యా వ్యాక్యోపదేశం చేశారు. ప్రతి ఒక్కమానవుడు ప్రార్థన చేయడం ద్వారా భగవంతుడి అనుగ్రహాన్ని పొందగలుగుతారని చెప్పారు. భగవంతుడి అనుగ్రహం ఉంటే పాపాల నుంచి ప్రమాదాల నుంచి రక్షింప బడతాడని తెలిపారు. అనంతరం వాక్య పరిచర్య చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి వచ్చిన పాస్టర్లు, సంఘకాపరి కె.జాన్‌బాబు పాల్గొన్నారు.

రూరల్ ఎస్ఐగా బాలునాయక్

మంగళగిరి: మంగళగిరి రూరల్ నూతన ఎస్ఐగా బాలునాయక్ నియమితులయ్యారు. ఇప్పటికే ఇద్దరు ఎస్ఐలు రూరల్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా మూడవ ఎస్ఐగా బాలూనాయక్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం స్టేషన్‌కు చేరుకుని రూరల్ ఎస్ఐగా బాలునాయక్ బాధ్యతలు స్వీకరిరించారు. ఎస్ఐలు , సిబ్బంది అభినందనలు తెలిపారు.

కష్టార్జితాన్ని కార్మిక కుటుంబాలకు చెల్లించాలి



తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టార్జితాన్ని యాజమాన్యం కార్మికుల కుటుంబాలకు చెల్లించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని నాయకులు కె. ఆదినారాయణతో కలసి సందర్శించి, మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యాన్ని కార్మికులు భిక్ష అడగడం లేదన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సుభాని, కె.హగ్గయ్య, ఇమాంబి, గురవయ్య, ఆశీర్వాదం, దుర్గా భవాని, రమణ, రిబ్కా, నాగ మల్లేశ్వరి పాల్గొన్నారు.

పీ-4 సర్వేపై అవగాహన కలిగి ఉండాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్



తెనాలిఅర్బన్: పీ-4 సర్వేపై అందరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావులు పేర్కొన్నారు. 7వ వార్డులోని సచివాలయంలో సోమవారం వార్డు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డులలో వార్డు సభలు జరుగుతున్నాయని చెప్పారు. పీ-4 సర్వే 90 శాతంపైగా పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన వారు కూడా సర్వే చేయించుకోవాలన్నారు. దీని వలన రానున్న రోజుల్లో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



బహుమతులు అందుకున్న విద్యార్థులు

మంగళగిరి: క్షయ వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ పి.స్నేహరాజ్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని ప్రభుత్వ వైద్యశాల నుంచి నగర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్నేహరాజ్ మాట్లాడుతూ ప్రస్తుతం మంగళగిరిలో 80 క్షయ వ్యాధి కేసులున్నాయని తెలిపారు. వారికి ప్రభుత్వం తరుపున మందులు ఇచ్చి, సిబ్బంది ఇంటి వద్దనే పర్యేక్షిస్తున్నారని వెల్లడించారు. క్షయ బాధితులు తుమ్మినా, దగ్గినా తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందని పేర్కొన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, కళ్లె పడడం, సాయంత్రం జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి తగ్గితే వెంటనే డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుని, చికిత్స పొందాలని సూచించారు. టీబీ సూపర్‌వైజర్ సీతారామమూర్తి, హెడ్ నర్స్ రమణకుమారి, టీబీహెచ్‌బీ కె.శ్యామ్‌ప్రకాష్, టీబీ ల్యాబ్ టెక్నీషియన్ ఖలీల్, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, మలేరియా సిబ్బంది, ఆశ వర్కర్స్, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ నివారణ దినోత్సవం ర్యాలీ

నగర పరిధిలోని టిప్పర్ల రోడ్డులో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ టీబీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎయిమ్స్ మెడికల్ కాలేజి విద్యార్థులు పాల్గొని విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఎయిమ్స్ డాక్టర్ పి.శ్రీకాంత్, హైస్కూలు ప్రధనోపాధ్యాయులు షేక్ దరియావలి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి వినతి



మున్సిపల్ కమిషనర్ ఆలీంబాషాకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మంగళగిరి: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మంగళగిరిలోని కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఆలీంబాషాకు వినతిపత్రం అందజేశారు. పర్మినెంట్ కార్మికుల చెప్పులు, సబ్బులు, నూనె, యూనిఫాం, ఇంక్రిమెంట్, డీఏ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. శానిటేషన్ విభాగంలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరానికి అధికారులు చొరవ చూపడం లేదన్నారు. పబ్లిక్, పండగ, ఆప్షనల్ సెలవులు కార్మికులకు అమలు చేయడం లేదని చెప్పారు. 2019 నుంచి సబ్బులు, నూనెలు, యూనిఫాం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.బాలాజీ, జె.శ్రీనివాసరావు, బి.రమణమ్మ పాల్గొన్నారు.

న్యాయ సంహిత చట్టం రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న కార్మికులు

ఫిరంగిపురం: ఆటో, ట్రాలీ డ్రైవర్లకు ఉరితాడుగా ఉన్న భారతీయ న్యాయ సంహిత- 2023 చట్టాని రద్దు చేయాలని ఢిల్లీలో జరుగుతున్న నిరసనకు సంఘీభావంగా ఫిరంగిపురం, పొనుగుపాడుల్లో ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్‌వలి మాట్లాడుతూ అనేకమంది ఉన్నత విద్యాభ్యాసం చేసిన నిరుద్యోగులు ఆటోలు, ట్రాలీలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ప్రమాదవశాత్తు మనిషి చనిపోతే వాహనం నడిపే డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా చూపి రూ.10 లక్షలు జరిమానా, జైలు శిక్ష విధించేలా భారతీయ న్యాయ సంహిత చట్టం ఉండడం సరికాదన్నారు. ప్రభుత్వం ఈచట్టాన్ని ఉపసంహరించుకోవాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొనుగుపాడు, ఫిరంగిపురం ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

మంగళగిరి: డ్రైవర్ల మెడకు ఉరితాడుగా మారిన భారతీయ న్యాయ సంహిత- 2023 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. మంగళగిరిలోని మండడం ఆటోస్టాండ్ వద్ద యూనియన్ పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లపై భారీ మొత్తంలో పెనాల్టీలు, జైలు శిక్షలు, లక్షలలో జరిమానాలు విధించడాన్ని ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమలాకర్, సుదర్శన్, జోషఫ్, కోటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

జీవో నంబరు 21ని రద్దు చేయాలి

తాడేపల్లి రూరల్ : ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీవో నంబరు 21ని రద్దు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్ దగ్గర ఆటోస్టాండ్‌లో ఆటో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రవాణా రంగంలో ఆటోలు, ట్రక్కులు, లారీలు తదితర వాహనాలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే తనిఖీలు నిర్వహించాలని కోరారు.. జీవో నెం. 21 ద్వారా రవాణా రంగ కార్మికులపై విపరీతమైన అపరాధ రుసుంవిధించే అవకాశం ఉందనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టే కరుణాకరరావు, పల్లి కృష్ణ, బాషా, కోటి, కార్మికుల పాల్గొన్నారు.

ధర్నా విజయవంతానికి పిలుపు



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మంగళగిరి: ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మంగళగిరిలో మూడు రోజులుగా సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎనిమిది బృందాలు ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రజల నుంచి అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ నేతన్న నేస్తం కొనసాగించి, చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని మంత్రి మండలి ఆమోదం పొందినా.. అమలు కావడం లేదన్నారు. వెంటనే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ చెంగయ్య, ఎం.బాలాజీ పాల్గొన్నారు.